ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటయ్యేనా !

- డీడీలు కట్టి మూడేళ్లు
- మరో రూ.60 వేలు కడితేనే ఏర్పాటు
- కొర్రీలు పెడుతున్న అధికారులు
- మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం


కొత్తగూడెంలో కట్టిన డీడీలను చూపుతున్న రైతులు

సంగెం: అధికారులు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండడం లేదు. అన్నదాతల వ్యవసాయ బావులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరుగురు రైతులు ఒక్కొక్కరూ రూ 5,290ల చొప్పున డీడీలు కట్టాల్సి ఉంటుంది. అధికారుల సూచనల మేరకు ఫిబ్రవరి–2020లో మండలంలోని కొత్తగూడెంకు చెందిన ఆరుగురు రైతులు డీడీలు కట్టారు. కట్టిన డీడీలు సరిపోవని చెప్పడంతో మరో ఇద్దరు కట్టారు. ముందుగా 8 మంది రైతులు సంగెం సెక్షన్‌లోని ట్రాన్స్‌కో అధికారులకు డీడీలు అందజేశారు. వారు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం అధికారులు స్కెచ్ వేసి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ తర్వాత వ్యవసాయ భూములు కాపులకనపర్తి సెక్షన్ పరిధిలోని గవిచర్ల రెవెన్యూ పరిధిలోకి వస్తుందని డీడీలు తిరిగి రైతులకు ఇవ్వడంతో వాటిని కాపులకనిపర్తి అధికారులకు అందజేశారు. దీంతో వారు వ్యవసాయబావులను సందర్శించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం కోసం సర్వే నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేశారు. నాడు డీడీలు కట్టిన తర్వాత ఎస్టిమేషన్ కాస్ట్ పెరిగిందని రైతులు సుమారు రూ.60 వేలు చెల్లిస్తేనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని అధికారులు చావుకబురు చల్లగా చెప్పినట్లు చెప్పారు. పంటలు పండిస్తే పెట్టుబడి కూడా మిగలడం లేదని ఇప్పుడు ఒక్కో రైతు రూ.10వేల చొప్పున చెల్లించలేమని రైతులు కౌసల్య, సౌజన్య, రాజ్‌కుమార్, విజయ, సవి తారాణి, శ్రవణ్‌కుమార్, సారయ్య, వెంకన్న, కొమురెల్లి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మండలంలోని రామచంద్రాపురంలోని మరో 8 మంది రైతులు మూడేళ్ల క్రితం డీడీలు కట్టారు. వీరు అదనంగా మరో రూ 1.20 లక్షలు చెల్లించాలని చెప్పారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ట్రాన్స్‌కో డీఈల దృష్టికి తీసుకుని పోయినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మూడేళ్ల క్రితం చెల్లించిన డీడీలను ప్రాతిపదికలోకి తీసుకుని కొత్తగూడెం, రామచంద్రాపురం గ్రామాల్లో అదనపు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

సబ్సిడీ పోను మిగిలినవి కట్టాలి

రైతులు డీడీలు కట్టిన విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం 2020లో ఎస్టిమేషన్ కాస్ట్‌కు 2023 ఎస్టిమేషన్ కాస్ట్‌లో భారీగా పెరిగిందన్నారు. రైతులు కట్టిన డీడీలను ఆన్‌లైన్ చేసిన తర్వాత అవసరమయ్యే స్తంభాల లెక్కన సబ్సిడీ పోను మిగిలిన డబ్బులు చెల్లించాలి. చెల్లిస్తేనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సాధ్యమవుతుంది.

– తిరుపతిరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ, కాపులకనపర్తి

ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

సంగెం: ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కాట్రపల్లిలో రోడ్డు విస్తరణ పనులను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన 33 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా ప్రజలు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ క్రీడల్లో పాల్గొనాలి

- జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న


క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పెద్ది స్వప్న

చెన్నారావుపేట : అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం నుంచి నిర్వహించే క్రీడల్లో ప్రతి మహిళ పాల్గొనాలని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షురాలు రాజులపాటి ఉమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక జాగృతి హైస్కూల్‌లో ఆదివారం క్రీడా ప్రాంగణాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సౌజన్యంతో మహిళల్లో చైతన్యం తీసుకోని రావడానికి ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, మండల నాయకులు కంది కృష్ణచైతన్యరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు సాంబయ్య, వాకిటి విక్రంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారోబార్లు, సిబ్బంది మండల కమిటీ ఎన్నిక


అంకూష్‌గౌడ్, రాజయ్య

నర్సంపేట రూరల్ : మండల గ్రామపంచాయతీ కారోబార్స్, సిబ్బంది అధ్యక్ష, కార్యదర్శులుగా వల్లాల అంకూస్‌గౌడ్, ఉల్లెరావు రాజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు జిల్లా కార్యదర్శి జన్ను శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా పొన్నం ఆనంద్, ఎండీ.యాకూబ్, సహాయ కార్యదర్శిగా నల్లా మహేందర్, ముత్తినేని రమేష్, కోశాధికారిగా నర్ర కృష్ణతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బోరు పనులు ప్రారంభం



నర్సంపేట రూరల్ : మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లిలోని పెద్దమ్మతల్లి గుడి వద్ద జెడ్పీటీసీ నిధులు నుంచి బోర్‌వెల్ మంజూరు చేశారు. ఈ పనులను ఆదివారం జెడ్పీటీసీ కోమాండ్ల జయమ్మగోపాల్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యువరాజు, లావణ్య కిషోర్, ఎంపీపీ మోతె కళమ్మ పద్మనాభరెడ్డి, ఉపసర్పంచ్ సునీత, సుదర్శన్, కృష్ణంరాజ్, దుర్గస్వామి, పాల్గొన్నారు.

పునఃప్రతిష్ఠ వేడుకలు



రాయపర్తి: మండలంలోని తిర్మలాయపల్లిలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి పునఃప్రతిష్ఠ వేడుకలను కనులపండువగా నిర్వహిస్తున్నారు. మార్చి 1న శ్రీలక్ష్మీనర్సింహస్వామిని పునఃప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో ఆదివారం పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆహ్వానించినట్లు ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుడి యుగేందర్‌రెడ్డి, మహబూబ్‌రెడ్డి, యాదగిరి, సోమిరెడ్డి, రామశేఖర్, రామంజం, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నల్లబెల్లి: మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి నాడెం శాంతి కుమార్ అన్నాడు. ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మున్నురుకాపులకు రాజకీయ గుర్తింపునివ్వాలని కోరారు. మున్నురు కాపు కులస్తులు ఐక్యంగా ముందుకు పోవాలన్నారు. కమ్యూనిటీ నిర్మాణానికి తనవంతుగా రూ. 5 వేలు విరాళంగా అందించారు. సమావేశంలో ఆ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు గట్టు ఆనంద్, మండల అధ్యక్షుడు కస్తూరి రవి, నాయకులు కొలగాని రామారావు, పెరుగు కృష్ణమూర్తి, మేడిపల్లి సుధాకర్, ఆకుల మధు, జంగిలి పద్మ, మేడిపల్లి శ్రీదేవి, పుప్పాల రాములు, రజినికాంత్, రమేష్, లక్ష్మయ్య, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పొదుపును అలవాటు చేసుకోవాలి



దుగ్గొండి: అందరూ కలిసి సంఘటితంగా ఉండి పొదుపును అలవర్చుకుంటే జీవితానికి సంతోషం మిగులుతుందని ఆదర్శ పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు కృష్ణనిరంజన్ అన్నారు. మండలంలోని నాచినపల్లిలో కాకతీయ పురుషుల పొదుపు సంఘం 26 వార్షిక సభ ఆదివారం నిర్వహించగా సంఘం అధ్యక్షుడు నంగునూరి సాంబయ్య వార్షిక నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. 1997లో రూ. 20 పొదుపుతో ప్రారంభమైన సంఘం నేడు 772 మంది సభ్యులతో రూ. 1కోటి 84లక్షల నిల్వకు చేరుకుందన్నారు. సమితి అధ్యక్షుడు కృష్ణనిరంజన్ మాట్లాడుతూ అందరూ కలిసి ఉంటే ఎంతటి కష్టాన్ని అయినా అవలీలగా ఎదుర్కోవచ్చన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సంఘ గణకుడు గుండెబోయిన రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


నర్సంపేట : ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నేతలు

నర్సంపేట: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన మద్దబోయిన రాజశేఖర్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రూ.3వేలు అందజేయగా ఆదివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కందగట్ల నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి వెంట బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజేందర్, రామాంజనేయులు, యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్‌కుమార్, బూత్ అధ్యక్షుడు నరేష్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్‌కు చెందిన సప్పట్ల బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని బీజేపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాణాప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు 50 కిలోల బియ్యం అందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో విజయ్, సంపత్, రమేష్, నాగేంద్రచారి, రంజిత్ ఉన్నారు. అలాగే అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందించారు. యూత్ సభ్యులు జీవన్, రాకేష్, సందీప్, మహేష్, రవికుమార్, ఉన్నారు.

తీరిన 'పెద్ది' మొక్కు



దుగ్గొండి: నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పెళ్లి చేసుకున్న అనంతరం తొలుత కొమ్మాల లక్ష్మినర్సింహస్వామిని సతీసమేతంగా దర్శించుకున్న విషయం విధితమే. ఆ సమయంలో పెళ్లి కానుకగా స్వామివారిని దుగ్గొండి, నల్లబెల్లి, ఆత్మకూరు మండలాల ప్రజలు సులభంగా జాతరకు చేరుకోవడానికి నాచినపల్లి నుంచి కొమ్మాల దేవస్థానం వరకు బీటీ రోడ్డు వేయిస్తానని మొక్కుకున్న మొక్కు ఆదివారంతో తీరిపోయింది. కొమ్మాల జాతరకు వివిధ మండలాల ప్రజలు నాచినపల్లి మీదుగా ఈదులచెరువు కట్టపై నుంచి మట్టిరోడ్డుపై వెళుతుంటారు. ఇదే క్రమంలో ఎమ్మెల్యే పెద్ది 2017 ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్న తర్వాత తిరుపతి నుంచి నేరుగా లక్ష్మినర్సింహస్వామిని దర్శించుకున్నాడు. అనంతరం మొక్కును వెల్లడించారు. 2018లో ఎమ్మెల్యే కాగా 2023లో జాతరకు రోడ్డు పనులు పూర్తి చేయించారు. ఆదివారం బీటీ రోడ్డు పనులు పూర్తి కావడంతో వివిధ మండలాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మార్చి 7న జరిగే జాతరకు ఎలాంటి అడ్డంకులు లేకుండా దర్శించుకోవచ్చని వారు తెలిపారు.

యువతి వివాహానికి ఎమ్మెల్యే అండ


ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నారావుపేట: తల్లిదండ్రులు లేని పేదింటి యువతికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతులు సహృదయాన్ని చాటుతూ అండగా నిలిచారు. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన చిన్నాల తేజస్విని అమ్మనాన్నలు రమేష్, వరలక్ష్మీలు మృతిచెందగా యువతి బంధువుల వద్ద పెరిగింది. తేజస్విని వివాహం మార్చి 1న చేయడానికి ఏర్పాట్లు చేశారు. కుటుంబ ధీనస్థితిని బీఆర్ఎస్ మండల నాయకులు, లింగాపురం క్లస్టర్ ఇన్‌చార్జ్ కంది కృష్ణచైతన్యరెడ్డి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి రూ. 20 వేల ఆర్థికసాయం అందించడంతో నాయకులు కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో పెద్ది దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పసునూటి రమేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నమిండ్ల సురేష్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు రాజులపాటి ఉమాదేవి, అశోక్, కంది రవి చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ ఏఎల్ మల్లయ్య మృతికి సంతాపం


మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

నర్సంపేట: గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ ఏఎల్ మల్లయ్య అకాల మృతికి గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు గుంటి సంజీవ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ అధ్యక్షుడు డాక్టర్ బయ్య సాంబమూర్తి మాట్లాడుతూ మల్లయ్య గంగపుత్ర సంఘానికి, బీసీ ఏ కులాలకు వారు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షురాలు గుంటి రమాదేవి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు పూస కిత, పట్టణ గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి రావులపల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన కిషన్, డాక్టర్ మేరు సత్యనారాయణ, నరేందర్, సత్యనారాయణ, నారాయణ, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత


వర్ధన్నపేట : ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ సుమన్ తల్వార్


సంగెం : పతకాలు సాధించిన కేజీబీవీ విద్యార్థినులు

వర్ధన్నపేట : మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆదివారం వరంగల్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నేషనల్ చైర్మన్ డాక్టర్ సుమన్ తల్వార్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే ఎంఈఓ రంగయ్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ డాక్టర్ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెపు రాజేంద్రం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆదిలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిందు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

సంగెం: వరంగల్‌లోని జీడబ్ల్యూసీ ఇండోర్ స్టేడియంలో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ –2023 పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రత్యేకాధికారిణి నీలిమ తెలిపారు. ఆదివారం జరిగిన పోటీల్లో 13 మంది బాలికలు పాల్గొనగా ఐదుగురు గోల్డ్, నలుగురు సిల్వర్, నలుగురు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన బాలికలను ప్రత్యేకాధికారిణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సంగెంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

సంగెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు. 20 ఏళ్ల తర్వాత 150 మంది విద్యార్థులు అందరూ కలుసుకుని ఆనాటి చిలిపిచేష్టలను, తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వారు పనిచేస్తున్న హోదాలను పరిచయం చేసుకుని స్నేహబంధాన్ని కొనసాగిస్తామని ఐక్యత చాటారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు రవీందర్, సుధాకర్, నాగరాజు, నవీన్‌కుమార్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎడ్లబండిని ఢీకొట్టిన ద్విచక్రవాహనం



సంగెం: ఎడ్ల బండిని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన గోలి రవీందర్ రైతు వ్యవసాయబావి వద్ద పనులు ముగించుకుని ఎడ్లబండిపై ఇంటికి తిరిగి వస్తున్నాడు. లోహిత గ్రామానికి చెందిన ల్యాదల్ల కృష్ణ, బొడ్డుపల్లి రాజులు వరంగల్ నుంచి గ్రామానికి వస్తున్నారు. గవిచర్ల సమీపంలోకి రాగానే ఎడ్లబండిని వెనక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టారు. ఈ సంఘటనలో కృష్ణ, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

భర్తను రాయితో కొట్టిన భార్య

చెన్నారావుపేట: భార్యభర్తల తగాదాలో భర్తను భార్య రాయితో కొట్టడంతో తీవ్రగాయాలైన ఘటన మండలంలోని తోపనగడ్డ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై తోట మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..ఇదే తండాకు చెందిన బాదావత్ బాలు అతని భార్య అరుణ గురువారం మొక్కజొన్న చేనుకు నీళ్లు కట్టడానికి వెళ్లారు. నీళ్లు కడుతున్న సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో అరుణ రాయి తీసుకొని భర్త తలపై కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిన బాలు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాలు ఫిర్యాదు మేరకు భార్య అరుణతో పాటు ఆమెకు సహకరించిన బానోతు సాగర్, బానోతు నర్సింహలపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఖానాపురం : మండలంలోని నాజీతండా సర్పంచ్ బాలకిషన్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. నాజీతండాకు చెందిన ఆశ కార్యకర్త నీల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విధితమే. దీంతో ఆమె భర్త చిన్న రాజు ఫిర్యాదు మేరకు వేధింపులు, ఆత్మహత్యాయత్నానికి కారమైనందుకు మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



గీసుకొండ: మండలంలోని రాంపూర్ గ్రామంలో నిర్మిస్తున్న అభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి గీసుకొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్, ప్రముఖ సామాజిక సేవకుడు పెగళ్లపాటి లక్ష్మినారాయణ రూ.1,00,116లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ గాజర్ల గోపి, దేవాలయ కమిటీ బాధ్యులు తాబేటి వెంకటేశ్వర్లు, రడం భరత్‌లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు


రక్తదానం చేస్తున్న యువకులు

గీసుకొండ : ఇటీవల అకాల మరణం చెందిన ధర్మారం గ్రామానికి చెందిన బండా మనోజ్‌కుమార్ (పింకు) జ్ఞాపకార్థం ఆదివారం అతని స్నేహితులు ధర్మారం రైల్వే గేట్ సమీపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 50 మందికి పైగా యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గూడూరు: రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినీలు, చిన్నారులపై రోజురోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, బాధ్యులపై కఠిన చర్య తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం వెంకన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం కటకం బుచ్చిరాములు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్లే మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వరంగల్ కేఎంసీలో పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఉపేందర్‌యాదవ్, నాయకులు వీరస్వామి, బిచ్చనాయక్, పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ శంకర్

ఖానాపురం : యువత క్రీడల్లో రాణించాలని ఎంపీటీసీ భట్టు శంకర్ అన్నారు. మండలంలోని దబ్బీరుపేటలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కార్యక్రమంలో భాగంగా ఆప్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వ్యవస్థాపకుడు దేశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ క్రీడా సామగ్రిని గ్రామయువతకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు సహకారం అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి


నల్లబెల్లిలో ఎండిపోయిన మొక్కలు

నల్లబెల్లి: మొక్కల రక్షణ మరిచిన అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ బత్తిని మహేష్ అన్నారు. మండల కేంద్రంలో ఎండిపోయిన హరితహారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలను నాటించేలా చర్యలు తీసుకోవాలని మహేష్ కోరారు.